# "పూచికపుల్ల"

రచన: "సరస్వతి"

మేఘం గర్జించింది. లోకం హర్షించింది. గర్జించిన మేఘం గర్జించలేక భగ్గున కక్కినట్లు కుండపోతగా వర్షించటం మొదలు పెట్టింది. కొండలు, గుట్టలమీద పడ్డ నీరు చిన్న సెలయేళ్ళు పట్టుకొని ప్రాకుకుంటూ పోతున్నది. ఒక నదీ ప్రవాహానికి నాంది జరిగింది.

మేఘం గర్జించింది. గదిలో ప్రాణి గుండె దడ దడ లాడింది. 'కాన్పు కష్టమయింది. పెద్ద ప్రాణానికి ముప్పు తెచ్చేవాడే' ఇత్యాదులతో బయటపడ్డది చిన్న ప్రాణం. ఒక పాత్రకి నాంది జరిగింది.

పెద్ద ఆర్భాటం, హంగు లేకుండానే 'బాలసారె' జరిగిపోయింది. 'పుల్లయ్య' అని పెద్దలు నామకరణం చేసినా 'నాకేమీ తెలియదన్నట్లు' బోసిగా నవ్వింది ఆ ప్రాణం. 'చీపురు' వారింట పుట్టటంచేత 'చీపురు పుల్లయ్య' అయింది ఆ ప్రాణం

ఉరుకులు పరుగులువేస్తూ- కొండలమీద నుండి దూకుతూ పరుగెడుతున్నది. అన్ని పక్కలనుండి నీరు వచ్చి కలుస్తున్నది. చీపురు పుల్లయ్యకూడ ఉరకలు పరుగులు వేస్తూ బాల్యం గడిపి సాఫీగా యౌవనంలో కాలు పెట్టాడు. నగికి కుడిపక్కనుండి వచ్చిందో, ఎడమ పక్కనుండి వచ్చిందో కాని 'కామాక్షి' అనే ఉపనది కలిసింది. నిండుగా, హుందాతనంతో 'పెళ్ళికొడుకు' అయి, 'కామాక్షిని' జీవిత భాగస్వామిగా స్వీకరించాడు పుల్లయ్య రెండు నదులూ ఒకటైనయి. నీరు నీరులో కలిసింది, రెండు ప్రాణాలు, రెండుమనసులు ఒకటయినయి. లోకాన్నే ధిక్కరించిందా అన్నట్లు సాగిపోతున్నది నది. కన్నూ మిన్నూ కానక ఉరకలు పరుగులెత్తసాగింది. 'నీవుండగా నాకేమి' అని ఇద్దరూ అనుకున్నారు.

సంఘం కట్టిన ఆనకట్టలను తెంచుకోలేక గదిలోంచి బయటకుపోయే కాల్వలవలె కామాక్షమ్మగారు కూతుళ్ళను అత్తవారింటికి పంపింది. పుల్లయ్యగారి కొడుకులు ఉద్యోగాలకని దేశంమీదికిపోయారు. కాల్వలు వేరైనాక మిగిలిన నీరు తీసికొని నది ఆనకట్ట దాటుతుంది. కామాక్షి, పుల్లయ్యలు నిండు గుండెలతో సంఘంకట్టిన ఆనకట్టలు దాటారు. ఆ నదికి ఇప్పుడు ముందున్న వడిలేదు 'ఎందుకు వచ్చిందిరా భగవంతుడా' అన్నట్లు గంభీరంగా, నిండుగా ప్రవహిస్తున్నది. పుల్లయ్య కామాక్షమ్మగార్లలో ఇదివరకున్న జవసత్వాలు నశించినయి. జుట్టు నెరిసింది. వార్థక్యం తొంగిచూస్తున్నది ఇద్దరిలోనూ,

దారిలో మళ్ళీ ఒక కాల్వ నదిలో కలిసింది. కాని అందులో నీరు ఇంకిపోయింది. పెళ్ళయి నాలుగేళ్ళయినా కాకుండానే బొట్టు చెరిపి వేసుకుని చిన్నకూతురు పుట్టిల్లు చేరుకుంది. కామాక్షమ్మగారు కుళ్ళి కుళ్ళి ఏడ్చింది. కన్నకడుపును కడుపులో పెట్టుకుంది 'నాకూతురు నాకుభారమా?' అనుకుంది. పుల్లయ్యగారికి ఇప్పుడు నిత్యం దైవచింతనమే. వేరేధ్యాస ఏమీలేదు.

కామాక్షమ్మగారికి ఇప్పుడు గట్టి భయం పట్టుకుంది. విసిరేసినట్లు కొడుకులు దేశంమీదకు వెళ్ళిపోయినారు. కూతుళ్ళు తమ కాపురాలు దిద్దుకోవడంలోనే సతమతమయి పోతున్నారు. 'ఏ కాలో, చెయ్యో పడిపోతే ఎవరు చూస్తారు?' ఉండబట్టలేకపోయింది. 'నా పేర నాలుగెకరాలు వ్రాయండి. కొడుకులు చూస్తారో లేదో కనీసం ఇంతచెక్కన్నా ఉంటే ఎవరన్నా ఇంత ఉడకేసి పెడతారు' మరునాటి రోజే పుల్లయ్యగారు యావదాస్తి భార్యపేర రాశారు

నది డెల్టా సమీపించింది. కలిసివస్తున్న నదిని నిర్లక్ష్యంగా రెండుగా కోసింది డెల్టా. కలిసివస్తున్న జీవుల్ని కాలుడు వేరుచేశాడు. దశాబ్దాలుగా వస్తున్న ప్రవాహం కాలాన్ని ఎదిరించలేక రెండుగా విడిపోయింది. నదీ పాయ ఒకటి సముద్రం చేరింది.

కొడుకులు వచ్చారు కోడళ్ళు, కూతుళ్ళు వచ్చారు. డెల్టాలోనే మంచిపంట పండుతుందంటారు. ఒకటిగా కలిసివస్తున్న జీవులు రెండుగా విడిపోయేసరికి కొడుకులు ఆస్తి భాగాలు పంచమని కూచున్నారు. 'పదకొండవ రోజుకూడ కాలేదు. ఆస్తికోసం పోట్లాడుతున్నారు. నాస్వార్జితం నా యిష్టానుసారం చేస్తాను మీకు ఒక్కదమ్మిడీకూడ ఇవ్వను పొండి' అని కసిరాడు పుల్లయ్య. కోడళ్ళు మెటికలు విరిచారు.

కొడుకులు చూడటం కాదుకదా ఇన్నేళ్ళు కలిసి ప్రయాణం చేసిన పుల్లయ్యకూడ తనతో రాలేదే?

'పోయేనాడూ వెంబడిరాదు పూచికపుల్లయినా' అనేపాటని 'పోయేనాడూ వెంబడి రాదూ చీపురు పుల్లయ్యా' అని పిల్లలు పాడుకుంటున్నారు అర్థం తెలిసో తెలియకో. కాని చీపురుపుల్లకుమటుకు అందులో నూరుపాళ్లు అర్థంకనిపించింది, వినిపించింది.

మార్గం వేరైనా గమ్యం ఒకటే అన్నట్లు నదీ రెండోపాయకూడ సముద్రాన్ని చేరుకుంది. కాని మొదటి పాయకోసం వెదికిందో లేదో? అంత అనంతంలో ఎక్కడని వెదుకుతుంది?

నీరు ఆవిరిగా-ఆవిరి మేఘంగా మారింది.

మేఘం గర్జించింది.

కాని ఈసారి ఎక్కడినుండి వచ్చిన నీరు అక్కడికే పోతుందని ఏమిటి నమ్మకం?

ఇది అంతం లేని చక్రం.

చీపురు పుల్లయ్య అందించిన జీవిత పరమ సత్యం.

—oo—

(6 వ పేజీ తరువాయి)

నియమించిన శ్రీ మదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు శత జయంతి నిర్వాహణ కమిటీ సాగిస్తుంది. వారి స్మృతి చిహ్నంగా ఊరూరా, వారి శైలిలో హరికథా కాలక్షేపం చేయడం కనీస ధర్మంగా మనం వారిఎడ గౌరవసూచకంగా చేయవలసివుంది. వారి జీవిత స్మృతులు ఆంధ్ర సంస్కృతిలో వారి హరికథా విధానాన్ని మిళితంచేసి శాశ్వత స్థానం కలిగించడం మన ధర్మం వారికే నా జోహారులు. ★